
ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023 5

పార్వతీపురం మన్యం




గోధుమ పిండి పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మున్సిపాలిటీలలో అర్హులైన పేదలకు గోధుమపిండి పంపిణీ ప్రారంభమైంది. బుధవారం పట్టణంలో స్థానిక నాయుడువీధిలో గోధుమపిండి పంపిణీని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆహార భద్రతకు గోధుమపిండిని ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు రెండు కిలోల గోధుమపిండిని కిలో రూ.16 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం మున్సిపాలిటీలో 11,827 రేషన్‌కార్డులు, పాలకొండలో 7,868, సాలూరులో 13,690 కార్డులు ఉన్నాయని, మొత్తం 33,385 కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ చేస్తామని వెల్లడించారు. పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

- గిరిజన వర్సిటీకి తగ్గిన బడ్జెట్
- తగ్గిన ఉపాధి నిధులతో ఇబ్బందులు ఎదుర్కోనున్న కూలీలు
- రైల్వే బడ్జెట్ పెంచినా జిల్లాకు సున్నా
- ఎస్‌సి, ఎస్‌టిలకూ తగ్గిన కేటాయింపులు
- ప్రస్తావనకు రాని ప్రత్యేక హోదా
- బయటపడ్డ కేంద్ర ప్రభుత్వ బండారం



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాపై మరోసారి వివక్ష ప్రదర్శించారు. కేంద్ర సాయం కోసం ఎదురు చూస్తున్న గిరిజన వర్సిటీకి గత ఏడాది కన్నా నిధులు తగ్గించారు. ఎన్నోసార్లు సాక్షాత్తు సిఎం జగన్మోహన్‌రెడ్డి విన్నవించిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ఎలాంటి సాయమూ అందించలేదు. వ్యవసాయం, కార్మిక సంక్షేమానికి, జాతీయ ఉపాధి హామీ వంటి అనేక రంగాలకు, పథకాలకు బడ్జెట్‌లో కోత విధించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని, అభివృద్ధిని కూడా కేంద్రం విస్మరించింది. ఆదాయ పన్ను పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినప్పటికీ, అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందినవారు రూ.3లక్షల నుంచీ పన్ను చెల్లించాల్సి వుంటుంది. గిరిజన ప్రాంతాల్లోని ఏకలవ్య పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిని పూర్తి స్థాయిలో భర్తీచేస్తామని చెప్పడం ఊరటనిచ్చే అంశంగా పరిగణించవచ్చు.

జిల్లాపై వివక్ష

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్రీయ గిరిజన వర్శిటీ ఏర్పాటు చేసి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ సొంత భవనం లేదు. పరాయి పంచన తరగతులు నిర్వహిస్తున్నారు. లేబొరేటరీ, లైబ్రరీల కోసం ఇతర ప్రైవేటు కాలేజీలపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. సుమారు ఏడేళ్లగా స్థల సేకరణ పేరుతోనే కాలక్షేపం చేసింది. తాజాగా మెంటాడ మండలం కుంటినవలసలో స్థలాన్ని గుర్తించినప్పటికీ సేకరణ నత్తనడకన సాగుతోంది. అధునాతన విద్యా ప్రమాణాలతో వర్శిటీ అందుబాటులోకి రావాలంటే తక్కువలో తక్కువగా రూ.1200కోట్లు అవసరమౌతాయి. కానీ, గడిచిన నాలుగైదేళ్లగా రూ.22కోట్లు చొప్పున కేటాయిస్తోంది. ఈ నిధులు అడ్మినిస్ట్రేషన్, భోదన, భోధనేతర సిబ్బంది జీతభత్యాలకే సరిపోని పరిస్థితి.

ఇటువంటి తరుణంలో కనీసం వర్శిటీ నిర్వహణకైనా నిధులు పెంచాల్సిన కేంద్రం కేవలం రూ.18.50కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడం గమనార్హం. ఇక దేశవ్యాప్తంగా కొత్తగా 50 ఎయిర్‌పోర్టులు, ఎయిర్ ప్యాడ్స్ ఏర్పాటు చేయనున్నట్టు, విరివిరిగా కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిన కేంద్రం జిల్లాలో తలపెట్టిన భోగాపురం ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టుకుగానీ, మెడికల్ కాలేజీకి గానీ ఎలాంటి సాయమూ అందించలేదు. మన జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేకపోవడం, సేవా రంగంలో ఎదుగుదల లేకపోవడం, వ్యవసాయరంగం ఉన్నా సాగునీటి వనరులు అభివృద్ధి చేయకపోవడం వంటి కారణాలతో చిన్నసన్నకారు రైతులు మొదలుకుని వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాలకు చెందిన వృత్తిదారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పనులు ఉపయోగించుకోవడంలో కొన్ని దశాబ్దాలుగా మన జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఇటువంటి తరుణంలో ఉపాధి హామీకి రూ.29,400కోట్లు తగ్గించడం కూలీలను కలవరపాటుకు గురిచేస్తోంది.

గత ఏడాది రూ.25వేల కోట్ల మేర తగ్గించి, నిబంధనలు కఠినతరం చేయడంతో అంతకు ముందు వరకు రూ.250 నుంచి రూ.257 వరకు వచ్చే కూలీల సగటు వేతనాలు, రూ.150 నుంచి రూ.157కు పరిమితమయ్యాయి. తాజా కోతలతో జిల్లా మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోనుంది. రైల్వే బడ్జెట్ భారీగా పెంచినట్టు చెప్పుకుంటున్నా ఆచరణలో వాల్తేరు డివిజన్, విజయనగరం రైల్వే స్టేషన్ల ప్రస్తావన ఎక్కడా లేదు. దీంతో, విజయనగరాన్ని మోడల్ స్టేషన్‌గా మారుస్తామన్న హామీ హుళక్కేనని మరోసారి స్పష్టమైంది.

పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని ఏకలవ్య పాఠశాలల్లో భోధన, బోధనేతర సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పడం ఊరట కలిగినప్పటికీ, అక్కడ భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల సంగతి ప్రశ్నార్థకంగానే మిగిలింది. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా ప్రత్యేక హోదా, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు సహా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి తదితరాలు కనీస ప్రస్తావనకు కూడా రాలేదు. మొత్తం వ్యవసాయ రంగానికి 22శాతం నిధులు కోత విధించడం, పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్యను అమాంతంగా కుదించడం వంటివాటితో రైతాంగం ఆందోళన చెందుతోంది. కుదేలవుతున్న చేనేత కార్మికులకు ప్రోత్సహంగానీ, కనీసం జిఎస్‌టి రాయితీగా లేదు. ఇలా అన్ని రంగాలపైనా భారాలు తప్ప, బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేకపోవడంతో రానున్న కాలంలో పేద, మధ్య తరగతి మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్



నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్‌కు ఊడిగం చేసేదే. దానివల్ల సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ఆదాయ పన్ను పరిమితి పెంచామని చెప్తున్నా ఆచరణలో దానివల్ల వేతన జీవులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్. బిజెపి మోసకారితనం బయట పడింది. ప్రజలంతా వ్యతిరేకించాలి.

- రెడ్డి వేణు, సిపిఎం జిల్లా కార్యదర్శి

జిల్లాకు ఒరిగిందేమీ లేదు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల మన రాష్ట్రానికి గానీ, జిల్లాకు గానీ ఒరిగిందేమీ లేదు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గిరిజన వర్శిటీకి చాలా కాలంగా అరకొర నిధులే కేటాయించింది. ఈ ఏడాది కేటాయించిన రూ.18.50కోట్లు కంటితుడుపు చర్య. మన జిల్లా ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగావున్న ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల జిల్లా అభివృద్ధి కుంటుబడుతుంది. కూలీల జీవనంపైనా తీవ్రమైన ప్రభావం పడుతుంది.

- మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌పి చైర్మన్

ఎన్నికల బడ్జెట్



కేంద్రబడ్జెట్.. ఎన్నికల బడ్జెట్‌లా, రాజకీయ ప్రయోజనాల కోసం రూపుదిద్దుకున్న బడ్జెట్‌లా కనపడుతోంది. కేవలం రూ.7 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఆదాయ పన్నులో ఊరట కల్పించారు. పక్కన కర్ణాటకకు భారీ కేటాయింపులు చేయడం, తెలుగు రాష్ట్రాలకు అంతగా కేటాయింపులు చేయకపోవడం అన్యాయం. రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్లో కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి.

- కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ స్పీకర్

ధాన్యమంతా కొంటాం

- వారం రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీల భర్తీ
- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాల్లో చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

రైతులవద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి సమావేశ భవనంలో బుధవారం జరిగాయి. 1,2,4,7 సంఘాలకు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశాల్లో ఉపాధిహామీ, వైద్యారోగ్యం, విద్య, గృహ నిర్మాణం, సమగ్ర శిక్ష, పంచాయితీ తదితర శాఖలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, మధ్యవర్తులు, దళారుల ప్రమేయం ఏమాత్రం లేకుండా తమ ప్రభుత్వం, రైతులవద్ద నుంచి నేరుగా భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. అంతేకాకుండా కేవలం పది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తోందన్నారు. అక్రమాలను అడ్డుకొని, నిజమైన రైతులందరి వద్దనుంచీ ధాన్యం కొనుగోలు చేయడానికే, ఇటీవల ఫోటోలను తీయించామన్నారు. ఇంకా మిగిలిపోయిన ధాన్యాన్ని కూడా పూర్తిగా కొనుగోలు చేస్తామనిహామీ ఇచ్చారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా, ఇ-పంటలో నమోదైన మేరకు సుమారు 5.15లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

రెండు జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధిపనులను నిర్వహించాలని ఛైర్మన్ ఆదేశించారు. రెండు జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేయాలని సూచించారు. పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థికసంఘం నిధులు, వాటి వినియోగం, పాఠశాలల మ్యాపింగ్, నాడూ-నేడు ఫేజ్-2 పనుల ప్రగతిపై చర్చించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలపై ఛైర్‌పర్సన్ ఆరా తీశారు. మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలను అందించడానికి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. జెడ్‌పి వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అధ్యక్షతన 3వ స్థాయీ సంఘ సమావేశం జరిగింది. వ్యవసాయంతోపాటు, పశు సంవర్థకం, పట్టు తదితర వ్యవసాయ అనుబంధ శాఖలపై చర్చించారు. వైఎస్‌ఆర్ సంచార పశు ఆరోగ్యకేంద్రం క్రింద ప్రతీ నియోజకవర్గానికి రెండో వాహనాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు.

జెడ్‌పి రెండో వైస్ ఛైర్మన్ కొర్రజన్ని సింహాచలం అధ్యక్షతన 6వ స్థాయి సంఘం, బొబ్బిలి జెడ్‌పిటిసి సభ్యురాలు శాంతకుమారి అధ్యక్షతన 5వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించి, ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు సమావేశాల్లో ఎంఎల్‌సి డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల అధికారులు, ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

జీవిత బీమా లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఈ ఏడాది జీవిత బీమా లక్ష్యం రూ.100 కోట్లు పూర్తిచేయాలని పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్‌విఎస్‌ఎన్ రాజు అన్నారు. బుధవారం పార్వతీపురం ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలో బీమా ఏజెంట్లు, తపాలా అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ.10 కోట్లు విలువైన బీమా పాలసీలను సేకరించినందుకు ఏజెంట్లను, డిఒలను అభినందించారు. రూ.2,28,447 డెత్ క్లెయిమ్‌ను దరఖాస్తుదారునికి ఆయన అందించారు.



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

టిడిపి మాయమాటలు నమ్మొద్దు

'గడపగడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ప్రతిపక్ష టిడిపి నాయకుల మాయమాటలు నమ్మొద్దని, వారి మాటలు నమ్మితే పేదలు నష్టపోతారని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. బుధవారం పట్టణంలోని ఏడో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. రాష్ట్రానికి సిఎంగా మళ్లీ జగన్ మోహన్ రెడ్డి అయితేనే యథావిధిగా పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌దేనని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వంగపండు అప్పల నాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ కొల్లి వెంకటరమణ, కమిషనర్ హెచ్ శంకరరావు, ఎఇ సూరినాయుడు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో వాటపాగు సచివాలయాన్ని డిఎల్‌డిఒ వి.వి.గోపాలకృష్ణ బుధవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టిక చూసి, హాజరు శాతం తక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది యూనిఫాం ధరించకపోవడం పట్ల ఆగ్రహించి, అందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వార్డెన్, పోలీసుల తీరుపై దుడ్డుఖల్లు గిరిజనుల ఆగ్రహం

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన ● చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజనుడు కొండగొర్రి కామరాజుపై తప్పుడు ఫిర్యాదు చేసిన దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వార్డెన్ మండంగి సుబ్బారావు, తీవ్రంగా కొట్టిన పోలీసులపై గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘాల ఆధ్వర్యాన దుడ్డుఖల్లు గ్రామ గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో మూడేళ్ల నుంచి కొండగొర్రి కామరాజు, ఆయన భార్యకు రోజుకు రూ.150 ఇవ్వడానికి వార్డెన్‌తో ఒప్పందం కుదుర్చుకొని పని చేయించుకున్నారని తెలిపారు. మూడేళ్లపాటు కామరాజు, ఆయన భార్య నిజాయితీతో హాస్టల్ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నప్పటికీ వార్డెన్ సుబ్బారావు జీతం సక్రమంగా చెల్లించలేదని తెలిపారు. మూడేళ్లకు గాను మూడు దఫాలుగా రూ.15 వేలు ఇచ్చారని చెప్పారు. గత నెల 20న జీతం సరిగా ఇవ్వడం లేదని, హాస్టల్లో పనిచేయలేమని కామరాజు చెప్పడంతో జీతం ఇచ్చేస్తానని వార్డెన్ సుబ్బారావు అంగీకరించారని తెలిపారు. కానీ కామరాజుపై హాస్టల్లో జనరేటర్ పోయిందని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్లో వార్డెన్ ఫిర్యాదు చేశారని వివరించారు. తప్పుడు ఫిర్యాదుపై ఎస్ఐ షణ్ముఖరావు విచారణ చేపట్టకుండా, కామరాజును స్టేషన్‌కి పిలిపించి, జనవరి 30న కొట్టారని తెలిపారు. కామరాజు భయపడి 31న గ్రామపెద్దలను తీసుకొని వెళ్తే వారి సమక్షంలో విచారణ చేయకుండా, వేరే గదిలోకి తీసుకెళ్లి విచారణ పేరుతో లాఠీలతో, రాడ్లతో కొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదే రోజు స్వగ్రామానికి రాత్రి 10 గంటలకు చేరిన కామరాజు శ్వాస ఆడక తీవ్ర ఇబ్బందులు పడ్డాడని వాపోయారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారని వివరించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వార్డెన్, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రాములమ్మకు, సిఐ సత్యనారాయణకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘాల నాయకులు మండంగి రమణ, నిమ్మక సింహాచలం, శ్రీనివాసరావు, కోరంగి సీతారాం, పువ్వల తిరుపతిరావు, కోలక అవినాష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లు గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దుడ్డుఖల్లు గ్రామస్తులు, గిరిజన సంఘాల నాయకులు

బాధితుడికి రెడ్డి వేణు పరామర్శ



వివరాలడిగి తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

పార్వతీపురం రూరల్ : జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న కామరాజును సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ పరామర్శించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్విన్‌పేట పోలీసులు.. కామరాజును రెండు రోజులపాటు స్టేషన్లో చితకబాదడం దారుణమన్నారు. అనంతరం కామరాజు తప్పు ఏమీలేదని వదిలేశారని చెప్పారు. ఏదైనా కేసు స్టేషన్‌కు వస్తే విచారణ చేయాలని, లేకుంటే కేసు నమోదు చేసి కోర్టుకు పంపాలని తెలిపారు. అంతే తప్ప ప్రజాస్వామ్యాన్ని, చట్టాన్ని కాపాడే పోలీసులు ఇలా కొట్టడం దుర్మార్గమైన చర్యన్నారు. ఇంతటి అవమానానికి పాల్పడిన కామరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆయన భార్య వాపోయినట్లు చెప్పారు. ఈ ఘటనపై కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కామరాజు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ధాన్యం కొనాలని 4న ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం

రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఈ నెల 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రకటించినా ఆ మేరకు ఎక్కడా పూర్తిగా కొనలేదని చెప్పారు. నేటికీ రైతుల వద్ద నుండి 60 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. ఇంకా 40 శాతం ధాన్యం కళ్లాల్లో నిల్వ ఉన్నాయని తెలిపారు. ఇంతలో ధాన్యం సేకరణను ప్రభుత్వం నిలిపేసిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయి దళారులకు పంటను తెగనమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వమే రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, బోరపరెడ్డి అప్పారావు, చందనపల్లి కృష్ణ, రెడ్డి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పసుకుడిలో ఏనుగులు

ప్రజాశక్తి-భామిని

మండలంలోని పసుకుడి చెరకు తోటలో బుధవారం ఏనుగుల గుంపు తిష్టవేసింది. ఘనసరా, తలడా, కొసలి, కీసర గ్రామాల నుంచి వంశధార కుడి కాలువ అవతలి ఎగువ ప్రాంతాలకు ఎలిఫెంట్ ట్రాకర్, అటవీ సిబ్బంది ఏనుగులను తరలించారు. కొద్ది రోజులుగా దశలు వారీగా దిమ్మిడిజోల, అనంతగిరి, భామిని, మూలగూడకు చేరిన ఏనుగులు.. మంగళవారం రాత్రి భామిని గ్రామ దిగువన వంశధార కుడి కాలువపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి ద్వారా వంశధార నది వద్దకు చేరుకున్నాయి. బుధవారం ఉదయం పసుకుడి చెరకు తోటలో తిష్టవేశాయి. 13 మంది ఎలిఫెంట్ ట్రాకర్లు, అటవీ సిబ్బందితో ఏనుగుల కదలికలను గమనిస్తున్నట్లు అటవీశాఖ బీట్ అధికారి లక్ష్మణమూర్తి తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.



తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య

లక్ష్యాలను చేరుకోవాలి

ఐటిడిఎ పిఒ బి.నవ్య

ప్రజాశక్తి-సీతంపేట

ఉపాధి హామీలో నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య.. సిబ్బందికి సూచించారు. బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వేతనదారులకు పూర్తి వేతనం రూ.257 వచ్చేలా పనికల్పించాలన్నారు. వేతనదారులకు ప్రతిరోజూ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఎపిడి శ్రీహరిరావు, ఎపిఒలు సాగర్, బాబురావు, ఇసి సింహాచలం పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-భామిని

మండలంలోని గురండి కేంద్రంలో రూ10 లక్షలతో ఫిష్‌ఆంధ్రా సెంటర్ ఏర్పాటు చేయటానికి జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రా యూనిట్ ఏర్పాటుకు 40 శాతం సబ్సిడీతో బ్యాంకు రూ.10 లక్షలు రుణాన్ని అందిస్తుందని చెప్పారు. సింగిడి గ్రామంలో రూ.3 లక్షలతో మినీ ఫిష్ అవుట్‌లెట్ ట్రైల్ రన్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డిఒ గోపి క్రిష్ణ, మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ, శ్రీను పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న జిల్లా మత్స్యశాఖాధికారి తిరుపతయ్య

ప్రజాశక్తి
www.prajasakti.com

వైసిపిలో బయటపడ్డ విభేదాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీ వైసిపిలో వర్గ విభేదాలు బయట పడ్డాయి. ఎప్పటి నుంచో వర్గాలు ఉన్నప్పటికీ ఎప్పుడూ బయట పడలేదు. వర్గ విభేదాలు బయట పడే సమయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు జోక్యం చేసుకోవడంతో ఇంత వరకూ బయటకు రాలేదు. విభేదాలు రోజురోజుకు పెరగడంతో కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో ఒక్కసారిగా బయట పడ్డాయి. బొబ్బిలిలో మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వర్గంగా ముద్రపడిన కౌన్సిలర్లు పట్ల ఎమ్మెల్యే వర్గంగా ముద్రపడిన చైర్మన్, ఇతర కౌన్సిలర్లు చిన్నచూపు చూడడంతో కౌన్సిల్ ప్రారంభం నుంచి చాపకింద నీరులా మున్సిపాలిటీలో రెండు వర్గాలుగా వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. బొత్స, జిల్లా పరిషత్ చైర్మన్ వర్గంగా ఉన్న కౌన్సిలర్లు పట్ల చిన్నచూపు చూస్తున్నారని వారంతా చాలా కాలంగా మనో వేదనతో ఉన్నారు. అధికారులు కూడా తమకు గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. దీంతో ఇటీవల నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో విభేదాలు బయటపడ్డాయి. బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి హాజరైనప్పటికీ ఎటువంటి మొహమాటం లేకుండా సమావేశంలో తమ ఆవేదనను చెప్పి కౌన్సిల్ సమావేశం నుంచి వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేసి మున్సిపల్ కార్యాలయం పోర్టికో వద్దకు వచ్చి అవినీతి ఆరోపణలు చేశారు. అవినీతి ఆరోపణలు చేస్తున్న సమయంలో కౌన్సిలర్లకు నచ్చజెప్పేందుకు వైస్ చైర్మన్ జి.రామదేవి ప్రయత్నించగా ఆమెపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతిపక్ష సభ్యులు పట్ల చులకన భావం

మున్సిపాలిటీలో ప్రతిపక్ష కౌన్సిలర్లు పట్ల చైర్మన్ చులకనభావం చూపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. వార్డు సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తే కనీసం వినడం లేదని సాక్షాత్తు టిడిపి కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడిపి వార్డులు పట్ల వివక్షత చూపుతున్నారని టిడిపి కౌన్సిలర్లు ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ ఆరోపిస్తు వచ్చారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే తమపై వివక్షత చూపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు.


నిరసన తెలుపుతున్న వైసిపి కౌన్సిలర్లు (ఫైల్)

చైర్మన్ ఏకపక్షధోరణి?

మున్సిపల్ చైర్మన్ ఏకపక్ష ధోరణితో మున్సిపాలిటీలో వర్గ విభేదాలు ఏర్పడ్డాయి. బొత్స, చిన్నశీను వర్గంగా ముద్రపొందిన కౌన్సిలర్లకు కనీసం విలువ ఇవ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తమ ఆవేదనను జిల్లా పరిషత్ చైర్మన్ వద్ద వినిపించిన తరువాత అందరూ కలిసి పనిచేయాలని ఆయన ఆదేశించినా తమకు విలువ, గౌరవం ఇవ్వడం లేదని కౌన్సిలర్లు ఆందోళన చెందుతున్నారు. కౌన్సిలర్లు అందరిని సమానంగా చూడాల్సిన చైర్మన్ చులకనగా చూస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన చెందుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపికి నష్టమే..

బొబ్బిలి మున్సిపాలిటీలో వర్గాలు ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా ఆ పార్టీ పట్ల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రోజురోజుకు అసంతృప్తి పెరగడంతో టిడిపికి ఆదరణ పెరుగుతుంది. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి విజయం సాధిస్తే బొబ్బిలి నియోజకవర్గంలో వైసిపి స్పీడ్‌కు టిడిపి బ్రేకులు వేసింది. అప్పటిలోనే రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని సాక్షాత్తు వైసిపి నేతలే చర్చించుకున్నారు. ఈ తరుణంలో మున్సిపాలిటీలో వర్గ విభేదాలు ముదురుతున్న నక్కపై తాటిపండు పడ్డ చందంగా వైసిపికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

మున్సిపల్ చైర్మన్ రాజీనామా చేయాలి : టిడిపి

సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు తన పదవికి రాజీనామా చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కోటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా పాలన, అభివృద్ధిలో మున్సిపల్ చైర్మన్ పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. సొంత పార్టీ కౌన్సిలర్లు అవినీతి ఆరోపణలు చేశారంటే అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులను గౌరవించే సంస్కారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు వలనే బొబ్బిలిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధిలో చైర్మన్ పాత్ర లేదన్నారు. అభివృద్ధిలో విఫలమై, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మన్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ బి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన వ్యక్తికి ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని చైర్మన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. తాము ప్రజల చేత ఎన్నుకోబడ్డామని, అందుకే కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించినా చైర్మన్ పట్టించుకోవడం లేదని అన్నారు. మూడో వార్డు కౌన్సిలర్ బి.సురేష్ మాట్లాడుతూ వార్డు సమస్యలపై ఒక దళిత మహిళా కౌన్సిలర్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తే కనీసం కౌన్సిలర్‌ను గౌరవించే సంస్కారం లేకపోవడం విచారకరమన్నారు. అవినీతి ఆరోపణలకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రహదారికి మరమ్మతులు చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

ఆంధ్ర-ఒడిశా అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రం సమీపంలో రోడ్డుపై ఉన్న గోతుల వద్ద బుధవారం నిరసన తెలియజేశారు. ఆసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ గోతుల్లో వాహనదారులు పడి, ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. రోడ్డు, భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిని బాగుచేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలోనూ వినతి అందిస్తామని చెప్పారు.

రూ.4.50 లక్షలతో ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి-బలిజిపేట

పెదపెంకి గ్రామంలో ఎస్‌టి కాలనీలో రూ.4.50 లక్షలతో ఏర్పాటుచేసిన ఇంటింటి కుళాయిలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం ప్రారంభించారు. ఇటీవల తాగునీటి సమస్యపై స్థానికులు విన్నవించడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారు. కాలనీలో అవసరమైన వీధుల్లో కాలువలు, రోడ్లు కూడా నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, సర్పంచ్ నగిరి పాపారావు, వైసిపి సీనియర్ నాయకులు గుడివాడ జగన్, గులిపిల్లి శ్రీనివాసరావు, గుడివాడ రమణ, గులిపిల్లి అప్పలనాయుడు, చప్ప సత్యంనాయుడు, మజ్జి బలరాం నాయుడు, మండల త్రినాథ, పోలి నాయుడు, జి.రామారావు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పంచాయతీలో బిడ్డక వీరయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఆయన భార్య మయంతికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ ఎ.మన్మథరావు బుధవారం అందించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్.వెంకట్రావు, ఎంపిటిసి ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు .


మయంతికి బీమా తక్షణ సహాయం అందజేస్తున్న సర్పంచ్ , ఎంపిటిసి

సర్పంచ్ సొంత నిధులతో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రజల సౌకర్యార్థం శ్మశానవాటిక వద్ద సొంత నిధులతో బోరు నిర్మాణానికి ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.చైతన్య ప్రవంతి ముందుకు వచ్చారు. ఎల్విన్‌పేట గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటిక స్థలంలో బుధవారం బోరు నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి శ్యామల, సిబ్బంది, వార్డు మెంబర్లు ఉన్నారు.

మహిళా మార్టుపై అవగాహన

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మహిళా మార్టుపై మండలంలోని కందులపదం, కొట్టుపరువులో బుధవారం ఎపిఎం జి.సింహాచలం ఆధ్వర్యాన అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికి అవసరమయ్యే సామగ్రి మహిళా మార్టు ద్వారా కొనుగోలు చేయొచ్చని తెలిపారు. బయట మార్కెట్ కంటే తక్కువగా రేట్లు ఉంటాయని, దీంతో మరికొంత లబ్ధి చేకూరుతుందన్నారు. దానికోసం మహిళా సంఘాల్లోని ప్రతి మహిళా రూ.300 చొప్పున వాటా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిసిలు రామకృష్ణ, కృష్ణవేణి, వాసు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన సెక్టోరియల్ బృందాలు

ప్రజాశక్తి - కురుపాం

విద్యాశాఖకు సంబంధించిన నాలుగు సెక్టోరియల్ బృందాలను మండలంలోని 40 పాఠశాలలను బుధవారం సందర్శించాయి. వీటిలో జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ, మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ, పాఠశాల స్థితిగతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై పర్యవేక్షించారు. ఉపాధ్యాయులకు రికార్డుల నిర్వహణ బాధ్యతలు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.


పెంగవ గ్రామంలో యువత, కార్యకర్తలతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ఓటర్ల పరిశీలన వేగవంతం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రెండో దశ ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం పెంగవ గ్రామంలో క్లస్టర్ నంబర్ 3, 8, 9, 10, 11 క్లస్టర్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తద్వారా టిడిపిని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు.


నీలానగరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు మానస, తనూజ

నీలానగరంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నీలానగరంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు ఎన్.మానస, ఎస్.తనూజ రోగులకు, బాలింతలకు, గర్భిణులకు తనిఖీలు చేసి, మందులు పంపిణీ చేశారు.

3న ఐటిఐలో దంతవైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 3న స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఐటిఐ విద్యార్థులకు దంతవైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.వి.గిరి తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాలువల్లో చెత్త తొలగింపు

ప్రజాశక్తి -భామిని

బాలేరులో కాలువల్లో పేరుకుపోయిన చెత్తను బుధవారం తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిటిసి కె.చంద్రశేఖర్ సూచించారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపిటిసి చంద్రశేఖర్

ఆర్‌టిసి సిబ్బంది రక్తదానం

ప్రజాశక్తి-సాలూరు

రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిపో మేనేజర్ భాస్కరరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 19 మంది ఆర్‌టిసి కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది రక్తదానం చేశారు. ఇంతవరకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహించిన ఆర్‌టిసి అధికారులు ఈసారి వినూత్నంగా రక్తదాన శిబిరం నిర్వహించడం గమనార్హం. కార్యక్రమంలో సూపరింటెండెంట్ (ట్రాఫిక్) గంగమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్‌టిసి పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పదిమంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణ్‌రావు, సీనియర్ డాక్టర్ జి.రవీంద్ర కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, డిపో అసిస్టెంట్ ఇంజనీర్ మెకానిక్ ఎంకెఎం రాజు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం రాజు, అకౌంటెంట్ నక్క, నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు బాసూరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఆర్‌టిసి సిబ్బంది

మేలైన సాగు పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

మేలైన సాగు విధానాలను అనుసరించి అపరాలలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ కె.తిరుపతిరావు అన్నారు విశ్వనాథపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని మంచాడవలస గ్రామంలో నిర్వహించిన అపరాల పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు అనుసరిస్తున్న సాగు పద్ధతుల్లోనే చిన్న చిన్న మార్పుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. జిల్లాలో వరిమాగానులలో వేస్తున్న అపరాలలో మొక్కల సాంద్రత తక్కువగా ఉందని చెప్పారు. దీనికి కారణం రైతులు తక్కువ విత్తన మోతాదును అనుసరించడమేనని శాస్త్రవేత్తలు గుర్తించారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరిమాగానుల్లో ఎకరానికి 12 కిలోలకు తక్కువ కాకుండా విత్తనాన్ని చల్లుకోవాలన్నారు. పూత దశలో మల్టీకె కేజీ, బోరాన్ 500 గ్రాములు కలిపి పిచికారీ చేసుకుంటే 10 నుంచి 15 శాతం దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పూత దశలో వచ్చే చీడపీడల నివారణ చాలా ముఖ్యమన్నారు. ఫిప్రో నిల్ ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్, ఈమిడా క్లోప్రిడ్ 0.4 ఎంఎల్ పిచికారీ ద్వారా రసం పీల్చు పురుగులు, ఆకు తినే పురుగులను నివారించుకోవచ్చున్నారు. సాఫ్ ఒక లీటర్ నీటికి ఒక గ్రాము కలిపి పిచికారి చేయడం ద్వారా అపరాలలో అధికంగా వచ్చే బూడిద తెగులును నివారించుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు అనంతరం పొలంబడి కార్యక్రమంలో రైతులకు 50 శాతం రాయితీపై నీం ఆయిల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో వివిఎ మోహన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి-సీతంపేట

వలగెడ్డకు చెందిన హిమరక ప్రసాద్‌ను విజయనగరం జిల్లా గరివిడి మండలం కోనూరుకు చెందిన మీసాల సత్యనారాయణ కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేయడంతో పాలకొండ డిఎస్‌పి జి.వి.కృష్ణారావు బుధవారం వలగెడ్డలో విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. వలగెడ్డ గ్రామానికి చెందిన ప్రసాదరావు కోనూరుకు చెందిన సత్యనారాయణకు 2017లో 6.67 ఎకరాల భూమిపై రూ.40 లక్షల నగదు ఇచ్చారు. ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయకపోవడం, డబ్బులు ఇవ్వకపోవడంతో గతేడాది డిసెంబరు 24న కోనూరుకు వెళ్లారు. 'డబ్బులు ఇవ్వను.. భూమి రిజిస్ట్రేషన్ చేయను పో' అంటూ కులం పేరుతో దూషించారని ప్రసాద్ ఇటీవల ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. అక్కడ నుంచి పాలకొండ డిఎస్‌పికి విచారణ చేపట్టాలని ఆదేశాలందాయి. దీంతో బుధవారం వలగెడ్డలో విచారణ చేపట్టారు. డిఎస్‌పితోపాటు సీతంపేట ఎస్ఐ నీలకంఠరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


విచారణ చేపడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

టీకాల నమోదు తప్పనిసరి

డిఐఒ జగన్మోహనరావు


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

చిన్నపిల్లలకు షెడ్యూల్ ప్రకారం వేస్తున్న వ్యాధినిరోధక టీకాల వివరాలను వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో విధిగా నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. బుధవారం స్థానిక వైకెఎం కాలనీలో వైద్య సిబ్బంది నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టీకా నమోదు కార్డులను, ఆర్‌సిహెచ్ రిజిస్టర్లను పరిశీలించారు. వెంటనే సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. తదుపరి టీకా గడువు తేదీలను చిన్నారుల తల్లిదండ్రులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పుష్ప, జయ గౌడ్, సచివాలయ హెల్త్ సెక్రటరీ స్వాతి పాల్గొన్నారు.

అభిషేక్‌కు సత్కారం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన యామల అభిషేక్ కుమార్‌ను బుధవారం పెద్దకాపువీధి పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్ఎం జామి రవి మాట్లాడుతూ అభిషేక్ భవిష్యత్తులో ఎన్నో అద్భుత విజయాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ పుష్పనాథం, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, పిట్ట ధర్మారావు, అప్పికొండ రాంబాబు, మామిడి విద్యా లత, ఎం.విజయలక్ష్మి, మండల వెంకట రమణ, కోట నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పోషణ్‌పై అవగాహన

ప్రజాశక్తి -భామిని

పోషణ్, పోషణ్ ప్లస్ ద్వారా అందిస్తున్న పదార్థాలపై సోలికిరి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాల, వ్యక్తిగత శుభ్రత, పసిపిల్లలకు దశలు వారీగా వేసే టీకాలు, పౌష్టికాహార ప్రాధాన్యత, బాలింతల ఆరోగ్య అంశాలు, తదితర వాటిపై ఎంపిటిసి కె.చంద్రశేఖర్ వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నిర్వాహకులు ఇందుమతి, పద్మ, శారద పాల్గొన్నారు.



సాధించిన ట్రోఫీతో చిన్నారులు

ఎస్ఎంఎఫ్ పాఠశాలలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సెయింట్ మోంట్ ఫోర్ట్ స్కూల్లో బుధవారం వార్షిక క్రీడా సంబరాలు ఘనంగా నిర్వహించారు. కురుపాం ఎస్ఐ సిహెచ్.ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడల్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ సిస్టర్ వినోలియా ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, షటిల్, క్రికెట్, రన్నింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బహుమతులను కరస్పాండెంట్ ఫాదర్ ఐజాక్ అందజేశారు.

ఆ బాధ్యత గృహ సారథులదే

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికీ తెలియజేసే బాధ్యత గృహసారథులదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. బుదవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అధ్యక్షతన 21 సచివాలయాల కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ 50 ఇళ్లకు ఇద్దరు పురుషులు, ఒక మహిళతో గృహ సారథులను నియమించామని చెప్పారు. మొదటి విడతలో మండల పరిధిలో 21 సచివాలయాలకు గాను 12 సచివాలయాల పరిధిలోని గృహసారథులకు గురువారం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గెడ్డలుప్పి, గుచ్చిమి, సూరంపేట, పెదభోగిలి-1, 2, చినభోగిలి, తామరకండి, బగ్గందొరవలస, కాశీపేట, ఆర్.వెంకంపేట, అంటిపేట, లచ్చయ్యపేట సచివాలయాల పరిధిలోని వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణకు అందరూ హాజరయ్యేలా చూసే బాధ్యత కార్యదర్శులు, సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి

హస్తకళలకు చేయూత

ప్రజాశక్తి-పాలకొండ

హస్తకళలకు ప్రభుత్వం చేయూతనందిస్తుందని సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్ తెలిపారు. పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఉన్న సామాజిక భవనంలో హస్త కళా సేవా కేంద్రం ఆధ్వర్యాన బుధవారం సెమినార్ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి హస్తకళల సేవా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, షేడ్ డైరెక్టర్ పి.డి.సుధీర్ కుమార్, న్యూహోప్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బేతాళ సుదర్శన్ బెన్హర్ హాజరయ్యారు. అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి మాట్లాడుతూ హస్తకళాకారులకు వివిధ పథకాల గురించి వివరించారు. హస్తకళల సేవా కేంద్రం కృషిని సబ్‌కలెక్టర్ ప్రశంసించారు.

జాతీయ పోటీలకు సింహాద్రి ఎంపిక

ప్రజాశక్తి -సీతంపేట

దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆరిక సింహాద్రి వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 23 నుంచి 25 తేదీల్లో కర్నూల్ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సింహాద్రిని ఐటిడిఎ పిఒ బి.నవ్య అభినందించారు. క్రీడాకారుడికి అవసరమయ్యే దుస్తులు, బూట్లతోపాటు వాలీబాల్ కిట్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. సింహాద్రిని ఒఎస్‌డి (ఎడ్యుకేషన్) యుగంధర్, హెచ్ఎం సుబ్బారావు అభినందించారు. కార్యక్రమంలో డిపిఒ సతీష్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్ ఎఎంఒ పి.కోటిబాబు, పాఠశాల పీడీ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



సంస్థ ద్వారా కొనుగోలు చేసిన పత్తి లారీ వద్ద రైతులు, సిబ్బంది

ఎఫ్‌పిఒ ద్వారా పత్తి కొనుగోలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నడుస్తున్నటువంటి రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి పత్తి కొనుగోలు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు అన్నారు. ఎఫ్‌పిఒల ద్వారా పత్తిని బుధవారం కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వరి, జీడితోపాటు చింతపండు తదితర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ సిబ్బంది ఎస్.సోనియా, ఉమామహేష్, వినోద్ కుమార్, ప్రభాకర్ రావు రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని వండవ గ్రామంలోనే బుధవారం తెల్లవారుజామున కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు డిఆర్‌ఒ పి.రవిబాబు తెలిపారు. గర్భిణీగా ఉన్న జింక గ్రామానికి సమీపంలో ఉన్న కొండపై నుంచి కిందికి దిగి ఓ చోట పిల్లలను పెడుతోంది. కుక్కలు చూసి దాడి చేయడంతో జింక మృతిచెందింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడికి చేరుకొని జింకకు పోస్టుమార్టం నిర్వహించి, దహనం చేసినట్లు ఆయన తెలిపారు.

సారా ప్యాకెట్లతో పట్టుబడ్డ వ్యక్తి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగిలో రెల్లివీధిలో సారా ప్యాకెట్లతో వ్యక్తి పట్టుబడినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. బుధవారం ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆ వీధిలో పోలీసులు దాడులు చేశారు. గ్రామానికి చెందిన వెలగాడ నాగు వద్ద 325 సారా ప్యాకెట్లు తోపాటు 20 లీటర్ల ట్యూబ్ లభ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. నాగును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.